
# నిరీక్షణ



టి.ఎస్.ఎస్ కృష్ణమూర్తి

రఘుపతి బాల్య మిత్రుడు రామం.

వాళ్ళ ప్రాంతంలో పెన్న, కృష్ణ, గోదావరిలాంటి జీవనదులు లేవు. ఊరి ప్రక్కనే బాహుదానది అని పిలువబడే కాలువ ఉంది కానీ భారీ వర్షాలుపడి పై ప్రాంతపు చెరువులన్నీ నిండి మరువలు పోతే తప్ప ఆ కాలువ భారీగా సాగదు. సాగినా అట్టే రోజులు మాత్రం కాదు! వర్షా కాలంలో మోకాటిలోతు నీళ్ళు వెడుతుంటాయి కొద్దిరోజులపాటు.

చిన్నతనంలో రఘుపతి రామంతో కలసి ఆ కాలువలో ఎన్నోసార్లు ఈత నేర్చుకునే ప్రయత్నాలు చేశాడు. ఈతయితే రాలేదు కానీ తరచూ మోకాళ్ళు, మోచేతులు కోసుకుపోయేవి గులకరాళ్ళు, ఇసుకా గీచుకుని! ఆ కాలువలో తమకు ఈతరాదని తేలిపోయాక మునగచెట్టు కొమ్మలు ఎండబెట్టి బెండ్లు తయారుచేసుకుని వాటితో కోడిగుడ్డు బావి, రంగారెడ్డిబావి అనే పేర్లు గలిగిన పెద్ద బావులలో ఈత నేర్చుకోవడం మొదలుపెట్టి కృతకృత్యులయ్యాక కూడా లెక్కలేనన్నిసార్లు ఆ కాలువ నీళ్ళలో పొర్లారు వాళ్ళు.

డబ్బా రేకులతో నీళ్ళను చేపలతో సహా ఒడ్డుకు చల్లుతూ చేపలు పట్టారు. చేపలు కాలువలో దొరకనప్పుడు కప్పపిల్లలను పట్టుకుని చొక్కాలకున్న పిన్ను సూదులతో గాలాలు తయారుచేసి వాటికి ఆ కప్పలను గుచ్చి వాటితో కంతలలో వున్న నీళ్ళ పాములను పట్టి లాగి ఆడుకున్నారు పలుమార్లు.

సరదాగా చేన్లలో చెనక్కాయలు, తోటల్లో మామిడికాయలు, లైబ్రరీలో సంతకాలు చెయ్యాల్సిన పుస్తకంలో దారానికి కట్టబడే పెన్సిల్లు కాజేస్తూ బ్రహ్మానందం అనుభవించారు.

ఆ రోజులు, నెలలు, సంవత్సరాలు మధుర క్షణాలలాగా గడచిపోయాయి. చదువులయ్యాయి.. నిరుద్యోగపర్వంలో రోజులు భారమయ్యాయి. బాధతో కూడిన ఆ బరువును మరచిపోయే ప్రయత్నాలు లెక్కలేనన్ని చేశారు ఇద్దరూ కలసి. సైకిళ్ల మీద జిల్లా అంతా పర్యటించి వచ్చారు ఓ పర్యాయం.

నడిరేయి గడచిపోయేవరకూ నాగులరాళ్ళ రచ్చమీద కూర్చుని.... "వాడి భార్య అట్ల.... వీడి భార్య ఇట్ల" అని చెప్పుకుంటూ కాలం గడిపే మగరాయుళ్లను... కొద్దిదూరంలో వున్న సున్నపురోలు తాలూకు ఇసుకదిబ్బలమీద వెన్నెల్లో కూర్చుని చూస్తూ "వీళ్ళ ఇండ్ల దగ్గర వీళ్ళ భార్య లేంచేస్తున్నారో?" అని గుసగుసగా చెప్పుకుని నవ్వుకోగల వయసొచ్చేసింది వారికి.

అనుకోకుండా రామం వాళ్ళ నాన్నగారికి దూరపు బంధువుల ఆస్తి కలసి రావడంతో పై చదువుల నిమిత్తం హాయిగా, సరదాగా, సుదూరంగా వెళ్ళిపోయాడు రామం.

అదృష్టవశాత్తు రఘుపతి వాళ్ళ నాన్నగారి దగ్గరి బంధువు ఎవరో సిఫార్సు ఉత్తరం సంపాదించడంవల్ల ఓ ప్రభుత్వం ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం లభించింది రఘుపతికి. ఆ వెంటనే రఘుపతి పెళ్ళి చేసి తద్వారా లభ్యమైన కట్నం డబ్బుతో అతని చెల్లాయికి పెళ్ళి చేసేసి తమ బాధ్యతలు, బరువులు దించేసుకుని క్రిష్ణా, రామా అనుకోవడం మొదలుపెట్టారు అతని తల్లిదండ్రులు.

పరీక్షలు చాలా సమీపంలో ఉన్నా కూడా విశాఖపట్నం నుండి పెళ్ళికి వచ్చిన రామం దాదాపు పదిరోజులపాటు రఘుపతి వాళ్ళింట్లోనే ఉండిపోయాడు తన ఇంటినీ తన వాళ్ళనూ కూడా మరచిపోయి.

పరీక్షలయిపోయిన వెంటనే మళ్ళీ వచ్చేసి రఘుపతి చెల్లి పెళ్ళి పనులలో సైతం తన సహాయ సహకారాలు అందించాడు.

★ ★ ★


చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్రమూ, గాడిదా ఒక్కటే. ఎబిలిటీకి విలువ ఉండదు. అలాంటి ఆఫీసులోనే రఘుపతి పనిచెయ్యడం. పైగా ఉత్తరాలకు విలువ ఇవ్వబడే రోజులు క్రమంగా వెళ్ళిపోయాయి. రఘుపతి దగ్గర దక్షిణలు లేకపోవడంవల్ల గుమాస్తాగానే కాలం గడిపెయ్యాల్సి వచ్చింది సంవత్సరాల తరబడి. అతని జీవితం ఒంటెద్దుబండి నడకయిపోయింది. పరిగెత్తదు... పడిపోదు..!

రామంపని అలాకాదు. అతనికి బిడ్డనిచ్చిన మామగారు తక్కువైనవారు కాకపోవడం వల్ల అల్లుడునీ, కుమార్తెనూ అమెరికా పంపడానికి తగిన ఏర్పాట్లు ముందే చేసేశాడు.

రామం తన పెళ్ళిలో సైతం రఘుపతినీ, అతని భార్యనూ పదిరోజులపాటు వదిలిపెట్టలేదు. తనవద్దే ఉంచుకుని ఆత్మబంధువులకు చెయ్యగల గౌరవాలన్నీ చేశాడు హార్ట్‌ఫుల్‌గా.

★ ★ ★

రఘుపతికి ఫోను సౌకర్యం లేదు. కలిగించుకోగల ఆర్థిక వనరులు లేవు. అందువల్ల రామం దంపతులు అమెరికా వెళ్ళాక అడపాదడపా



వాళ్ళకు ఉత్తరాలు వ్రాస్తూ వచ్చాడు రఘుపతి. తను వ్రాసిన ఉత్తరం గమ్యం చేరడానికి ఒక్కోసారి నెలరోజులు కూడా పట్టేది. జవాబు లభ్యమయేసరికి మరో నెలరోజులు గడచిపోయేవి... ఒక్కోసారి ఇంకా ఆలస్యంగా కూడా!

అలా అలా ఏడాదికి కనీసం నాలుగైదు ఉత్తరాలు నడుస్తూ వెళ్ళి జవాబులను పంపగలిగాయి మూడేళ్ళపాటు. ఆనక ఆసంఖ్య తగ్గిపోతూ వచ్చి చివరికి ఒన్‌వే ట్రాఫిక్ అయిపోయింది.

నిరంతర జీవన సంగ్రామం విరామ మివ్వక పోయినా చాలారోజులపాటు తనవంతు ప్రయత్నం తాను చేస్తూనే వచ్చాడు రఘుపతి. కానీ లాభం లేకపోయింది.

మొదటి రెండు పర్యాయాలూ ఇండియాకు వచ్చినప్పుడు రఘుపతి ఇంటికి వచ్చి అతనికీ, అతని భార్యా పిల్లలకూ ఏవో బహుమతులు కూడా ఇచ్చారు రామం దంపతులు. అమెరికా విశేషాలన్నీ చెప్పుకువచ్చారు. ఎప్పుడో ఓ పర్యాయం రఘుపతి దంపతుల్ని అమెరికా తీసుకువెళ్ళి ముఖ్యమైన ప్రదేశాలన్నీ చూపుతామని కూడా అన్నారు.

ఆపై వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో కూడా తెలీని పరిస్థితి ఏర్పడిపోయింది. యాదృచ్ఛికంగా కలిస్తే తప్ప రామం వచ్చాడని తెలిసేదే కాదు.

దూరం బాగా పెరిగి పెద్దదయింది.

జీవితాధ్యయనం చేసిన వాడు కాదు రఘుపతి. అందువల్ల అతనికి అంతా ఆశ్చర్యంగా, వింతగా, బాధగా వుంది. అతను గాఢంగా స్నేహం చేసింది అతని జీవితంలో ఒక్క రామంతోటే. ఇతర మిత్రులు లేరని కాదు. ఎందుకో వారందరికీ ఓ పరిచయస్తునిగానే మిగిలిపోయాడు రఘుపతి.

చాలా సంవత్సరాలు గడచిపోయాయి. చాలా చాలా దూరం అయిపోయాడు రామం. ఎటొచ్చీ కారణాలు మాత్రం తెలియవు. "అసలు కారణాలంటూ ఏమున్నాయనీ?" అని అనుకుంటూ బాధపడేవాడు రఘుపతి.

అనుకూలవతి అయిన భార్య. చక్కగా చదువుకుంటున్న రత్నాల్లాంటి పిల్లలు. ఒకరిని ఆశించకుండా జీవితం గడిపెయ్యడానికి చిన్నదే అయినా... ఉద్యోగం! నిలవడానికి నీడనిస్తూ పెద్దవాళ్ళిచ్చిన ఇల్లు. ఎవరికీ ఏ నొప్పీ నొయ్యీ లేని ఆరోగ్యాలు... వాస్తవానికి చాలా గొప్ప అదృష్టవంతుడు రఘుపతి.

అయితే అతని జీవితంలో తీరని అశాంతి... రామం దూరం కావడం వల్ల!

★ ★ ★

సిన్సియర్ అండ్ ఆనెస్ట్ ఎంప్లాయి అయినందున రఘుపతిమీద వాళ్ళ ఎంప్లాయర్‌కు చాలా అభిమానం. అందువల్ల నోముల పండుగకు రఘుపతిని మాత్రమే తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు ఆయన. రఘుపతి చిన్న ఇబ్బందిలో పడ్డాడు. ఆఫీసరు తనని ఒక్కడ్నే ఆహ్వానించినట్లు కొలీగ్స్‌కు తెలిస్తే వాళ్ళు బాధపడ్తారు. వెళ్ళకపోతే అధికారి నొచ్చుకుంటాడు.

బాగా ఆలోచించి చేసేదేమీ లేక ఆఫీసరు వాళ్ళింటికి వెళ్ళాడు రఘుపతి చివరికి.

ఇంటినిండా బంధువులు... ఎక్కువమంది ఆడవాళ్ళుండడంతో వ్రతం జరుగుతుండగా వరండాలోని కుర్చీలో ఒంటరిగా కూర్చున్న రఘుపతి ప్రక్క కుర్చీలోకి ఇంట్లోంచి ఓ యువకుడు వచ్చి కూర్చున్నాడు. తనూ ఆ గందరగోళంలోంచి వెలుపల పడినట్లే వుంది.

మాటల మధ్యన ఆ యువకుడు ఆఫీసరుగారి చిన్నల్లుడనీ భార్యా సమేతంగా అమెరికాలో ఉంటున్నాడనీ తెలియడంతో ఆనందపడిపోయాడు రఘుపతి.

"బాబూ! మా రామం, అతని భార్య జానకి కూడా అమెరికాలోనే ఉండడం... మీకు వారు తెలుసా?" అని ప్రశ్నిస్తూ తన పర్సులోంచి రామం దంపతులున్న చిన్న ఫోటో కూడా తీసి చూపించాడు.

ఇలాంటి అమాయకులు కూడా వుంటారా? అన్నట్లు చూశాడు ఆ యువకుడు తదేకంగా రఘుపతికేసి అర నిమిషంపాటు. తరువాత మరో అరనిముషం ఫోటో కేసి చూసి...

'వెరీ సారీ! తెలియదు... అలా తెలిసే అవకాశం కూడా అరుదే!!" అన్నాడు.

"అలాగా.... వారు న్యూయార్క్‌లోనే ఉండడం!" అంటూ అడ్రసు చెప్పాడు రఘుపతి.

"నేనుండడం టెక్సాస్ రాష్ట్రంలోని ఆస్టిన్‌లో. ఆ నగరానికీ ఈ నగరానికీ మధ్యన దాదాపు వెయ్యి కిలోమీటర్ల దూరం ఉంటుంది!" అంటూ నవ్వాడు ఆ యువకుడు.

"అక్కడున్న తెలుగు వాళ్ళందరూ అప్పుడప్పుడు కలుసుకోరా?"

"అమెరికాలోని ఊర్లలో.... అంటే.... నగరాలలో, పట్టణాలలో ఎంతమంది తెలుగువాళ్ళుంటున్నారో తెలుసా? దాదాపు రెండు లక్షలమంది. అక్కడ అందరూ అందర్నీ కలుసుకోవడం ఎప్పటికీ సాధ్యం కాని పని! తెలుగు సంఘాలు కొన్ని ఉన్నాయి. తెలుగు పత్రికలూ కొన్ని నడుస్తున్నాయి. తెలుగు సంఘాలు ఏర్పాటు చేసే కొన్ని సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు కొందరు తెలుగువాళ్ళు వెడుతుంటారు. ఫంక్షన్లలో ఎప్పుడో తప్ప కలుసుకోరు.

వాస్తవానికి అక్కడ జీవితం చాలా యాంత్రికంగా ఉంటుంది. ఎవరిపని వారు చేసుకుపోవాలి. ఏ చిన్నపని ఇతరుల చేత చేయించుకోవాలన్నా లెక్కకు మించిన ఖర్చుతో కూడుకున్న పని. కావలసినంత వ్యక్తిస్వేచ్ఛ ఉన్నాకూడా అక్కడ జీవించే వాళ్ళందరూ అదృష్టవంతులేనని అనుకోవడం కూడా తప్పే.

అక్కడ నిజానికి ఉద్యోగ భద్రత ఉండదు. ఎక్కువగా కాంట్రాక్టు సిస్టం... కష్టపడి పని చెయ్యగలవారే నిలదొక్కుకోగలుగుతారు. కొన్ని ఉద్యోగాలలో అయితే డ్యూటీకి అరగంట ఆలస్యంగా వచ్చినా చాలు ఉద్యోగంలోంచి తీసి వెయ్యబడడాన్కి. మళ్ళీ మరో ఉద్యోగం దొరికేవరకూ ఎంత ఇబ్బందో. ఎంతో మెకానికల్‌గా జీవితం గడుపుతున్న వారికి ఉత్తరాలు వ్రాయడానికి తగిన ఓపిక, వ్యవధి కూడా ఉండకపోవచ్చు బహుశా. ఇంతకూ ఆ రామంగారేం చేస్తారక్కడ?"

"మా రామం బయోకెమిస్ట్. జానకి సైంటిస్టు!"

"అలాగా? అలాంటి వారికి కొద్దిపాటి విరామం తప్పకుండా ఉండివుండవచ్చు!"

"మరి ఏండ్ల తరబడి ఉత్తరాలకు జవాబివ్వడే? ఇక్కడికి వచ్చేది, వెళ్ళేది కూడా తెలియకుండా పోతుంది!" అన్నాడు రఘుపతి బాధగా.

"అలాగా.... అయితే ఇంకో కారణం ఉండవచ్చు!"

"ఏమిటది?" కుతూహలంగా ప్రశ్నించాడు రఘుపతి.

"కానయితే అదే వాస్తవం అని నేననలేను కానీ

అమెరికాలో స్థిరపడ్డ అనేకమంది తాలూకు సమస్య ఏమిటంటే వాళ్ళక్కడ ఎంతో కష్టపడి యంత్రాల్లా జీవిస్తూ ఎప్పుడో ఓ పర్యాయం జన్మభూమికి తిరిగొస్తే బంధువులు, మిత్రులూ చాలామంది వారి నుండీ ఏదో ఒక సహాయం అర్థిస్తారు... లేదా ఆశిస్తారు కనీసం! కొందరయితే తమకు అక్కడో ఉద్యోగం చూపమంటూ వేధిస్తారు. అదీ కాకపోతే తమ స్వంత ఖర్చుతో వస్తాము అమెరికా అంతా చూపమంటారు. అమెరికా అంతా పర్యటించాలంటే ఒక మనిషికి దాదాపు ఐదు లక్షలవరకూ ఇండియన్ కరెన్సీ లెక్కలో ఖర్చుకాగలదనే విషయం వీరికి తెలియదు. ఒకవేళ వారా ఖర్చును భరించ గలిగినా అంత వ్యవధి చూపేవారికి కావద్దా? అన్నదో పెద్ద సమస్య. దాన్ని గూర్చి ఆలోచించరు.

ఏదీ చెయ్యలేమని చెప్పినా ఇక విరోధం ప్రకటించి మాట్లాడడం కూడా మానేస్తారు. నిజం చెప్పాలంటే నా పరిస్థితి కూడా అలాగే ఉంది. అందుకే నేను ఏ బంధువు ఇంటికి కాని స్నేహితుని ఇంటికి కానీ వెళ్ళను. ఎవరికీ కనీసం ఫోను కూడా చెయ్యను!" అన్నాడా యువకుడు నిజాయితీగా.

"నిజమా?" నిర్ఘాంతపోతూ ప్రశ్నించాడు రఘుపతి.

"నిజమే! స్టేట్సులో ఉద్యోగం చేసే వారిలో చాలామందికున్న సమస్యే ఇది. విసిగిపోయి ఇండియాకు రావడానికే అయిష్టత చూపేవాళ్ళున్నారంటే మీకు నమ్మకం కలుగకపోవచ్చు. తల్లిదండ్రులు, ముఖ్యమైన రక్త బంధువులు కాలం చెల్లిపోయాక ఇక ఇక్కడేముందిలే అనుకుంటూ అక్కడే స్థిరపడిపోయిన, పోతున్న వారూ వున్నారు!"

మొత్తానికి వ్రతం పూర్తయి వారికి భోజనాలకు పిలుపు వచ్చేలోపు ఆ యువకుడి నుండీ ఇంకా చాలా విషయాలు నమ్మశక్యంకాని సరికొత్త విషయాలను తెలుసుకున్నాడు రఘుపతి.

★ ★ ★

ఆఫీసరు వాళ్ళింటికి పండుగ అతిథిగా వెళ్ళివచ్చిన తరువాత రోజు రఘుపతి రామానికి ఓ ఉత్తరం వ్రాశాడు.

మైడియర్ రామం..

చాలాకాలం తరువాత నీకు ఉత్తరం వ్రాస్తున్నాను. ఏం చెయ్యను? నేనింకా నాటుపడవల, ఎడ్లబండ్ల కాలానికే పరిమితమైపోయి వున్నాను. ఫోను లాంటి సౌకర్యాలు కలిగించుకోలేదు. వాటి అవసరం లేకా... నిజం చెప్పాలంటే... అంత స్థాయి లేకా!

పోతే ఇక్కడ మేమందరం క్షేమం. అక్కడ నీవూ, జానకీ, బాబూ క్షేమమని తలుస్తాను.

మనమధ్య పెరిగిన దూరానికి నేనెప్పుడూ చింతిస్తూనే ఉంటాను.

మొన్న ఆ మధ్య భారీ వర్షాలు లెక్కకుమించి కురిసి మరమ్మత్తులకు నోచుకుని చెరువులూ ఆక్రమణలకు గురయిన మరవలున్న చెరువులూ తెగిపోయి బాహుదా నదికి కనీవినీ ఎరుగని ఎర్రనీటి వరదలొచ్చాయి. ఊర్లూ, వాడలూ గగ్గోలెత్తిపోయాయి కానీ నేను మన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ వరద నీటిలోకి దూరి పొర్లాలనుకున్నాను.




నేను దూకకపోయినా అనుకోకుండా వచ్చిన వరదలవల్ల ముప్పయిమంది దాకా కొట్టుకుపోయి కాలం చెల్లిపోయారు.

ప్రస్తుతం బాహుదా కాలువ మోకాలిలోతు నీటితో ప్రవహిస్తోంది. నీతో కలసి అందులోకి దిగాలనీ మోకాళ్ళు, మోచేతులు గీసుకుపోయేలా పొర్లాలనీ ఎంత తీవ్రంగా అనిపిస్తోందో?! మనం అలా చేస్తే మనకు పిచ్చి పట్టిందనుకుంటారేమో ఇప్పటి ప్రజలు? ఎందుకంటే కాలువ నీరే కాదు ... పెరిగిపోయిన ఊరి మురుగునీరు కూడా అందులో కలసి ప్రవహిస్తూ ఉంటుంది ప్రస్తుతం. బాగా పెరిగిన ఊరివల్ల చుట్టూవున్న చెరువుల నీళ్ళలో కూడా మురుగునీరు కలుస్తోంది. జీవజలాలు కనుమరుగయిపోతున్నాయి.

ఓసారి రాజప్ప తోటలో అల్లనేరేడు కాయల చెట్టెక్కామని మనల్నిద్దర్నీ రాజప్ప అదే చెట్టుకు కట్టెయ్యడం మనం భయంతో బిగుసుకుపోవడం... ఇప్పుడు తలచుకుంటుంటే ఎంత బాగుందో? నీతో కలసి మళ్ళీ ఆ చెట్టెక్కాలనిపిస్తోంది! ఎక్కగలమా?

మనకు వయస్సు పైబడుతోంది. సైకిళ్ళు తొక్కలేం కానీ ఓ మోటారు సైకిలు మీద ఇద్దరం కలసి మళ్ళీ జిల్లా అంతా నిరవధికంగా తిరిగి వస్తే బాగుంటుందని నా ఆలోచన, ఆకాంక్ష!

ఇలాంటి ఆలోచనలు నీకు రావా? ఎందుకంత బిర్ర బిగుసుకుని దూరం అయిపోతున్నావు?

ఇక్కడ నేనో ముఖ్య విషయాన్ని ప్రస్తావించక తప్పదు.

నేనెప్పుడూ నీనుండీ ఏదీ ఆశించలేదు. అసలు ఎవరినుండీ ఏమీ ఆశించకుండా ఆనందంగా జీవితాన్ని గడిపే సాత్వికుడ్ని నేనని నీకు తెలుసు కదా?

కాబట్టి జీవితంలో నేనెప్పుడూ నీకు ఆర్థికంగా ఇబ్బంది కలిగించే ఏ కోరికా కోరను! ఈ విషయంలో నీకు నమ్మకం ఉంది కదా?

పోతే ఆర్షధర్మాలను పాటిస్తూ జీవితాన్ని గడుపుతున్న వ్యక్తిగా నేనెప్పుడూ సముద్రాన్ని దాటి పరదేశంలో కాలుపెట్టను. అందువల్ల ఎప్పుడైనా సముద్రాలు దాటి నేను అమెరికాకు వచ్చి నిన్ను ఇబ్బంది పెట్టగలనన్న శంక నీకు వద్దు.

నా పిల్లలు బాగా పెరిగి పెద్ద వాళ్ళయినా వాళ్ళను ఇక్కడే, మన దేశంలోనే జీవింప చెయ్యాలనే ఆశయంతో ఉన్నవాడ్ని కాబట్టి వాళ్ళిక్కడే స్థిరపడ్తారు తప్ప విదేశాల కేసి చూడరు. కాబట్టి ఉత్తరోత్తరా కూడా నావల్ల నీకెప్పుడూ ఎలాంటి ఇబ్బందీ కలుగదు. ఇన్నేండ్ల సాహచర్యంలో నన్నామాత్రం అర్థం చేసుకోలేదా నీవు?

ఇలా నిర్మొహమాటంగా వ్రాసినందుకు నన్ను మన్నించు. నీనుండి నేను ఆశించేది ఏమంటావా?

"ఒరేయ్ వెధవా, నేను బాగున్నాన్రా... నా భార్యా పిల్లలు క్షేమం. నీవు, నీ భార్యా పిల్లలూ ఎలా వున్నారు?" అంటూ సంవత్సరానికి ఓ మూడు నాలుగు ఉత్తరాలు. ఎప్పుడైనా ఇక్కడికి వచ్చినపుడు కనీసం ఒకటి రెండ్రోజులు ఈ బాల్యమిత్రుని కోసం కేటాయింపు.

గతాన్ని నెమరు వేసుకుంటూ ఆ రెండ్రోజులూ ఇద్దరం కలసి గడపగలగడం! ఇంతే నేను కోరుకుంటున్నది.

నాకున్న ఒకే ఒక మిత్రుడివి నీవు. నీనుండీ ఈ మాత్రం నేను ఆశించవచ్చనే భావిస్తున్నాను నేను. అంగీకరిస్తావుగా? అంగీకరిస్తావనే ఆశతో నీ జవాబు కోసం ఎదురు చూస్తాను నేను.

జానకికి మా నమస్సులు, పిల్లలకు ఆశీస్సులు తెలుపు. ఎప్పటికీ నీ మిత్రుడు,

రఘుపతి.

ఆరోజే ఆ ఉత్తరాన్ని పోస్ట్ చేశాడు రఘుపతి. మరునాటి నుండి జవాబు కోసం ఎదురు చూడసాగాడు.... రోజులు గడిచిపోతున్నాయి.

❀